TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

జాతీయ తెలుగు దిన పత్రిక

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 28 | 21-6-2025 | శనివారం | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, M Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri

# మాట్లాడుకుందాం

## గోదావరి, కృష్ణా జల వివాదాలపై రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులం కూర్చొని చర్చిద్దాం



- 23న మంత్రివర్గ సమావేశం ఉంది.. అందులో బనకచర్లపై సమాలోచన
- ఆ తర్వాత ఒకడుగు ముందుకేసి చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తా
- ఏపీతో విభేదాలు కోరుకోవడం లేదు.. అలాగని రాజీ పడే ప్రసక్తే లేదు
- మా ప్రాజెక్టులకు అనుమతులొస్తే.. ఏపీ ప్రాజెక్టులపై అభ్యంతరం లేదు
- బనకచర్లపై ఏపీ నేరుగా కేంద్రానికి పీఎఫఆర్ ఇవ్వడంతోనే వివాదం
- రాజకీయంగా చచ్చిన బీఆర్ఎస్‌కు సంజీవనిగా జలవివాదాలు
- సాగునీటి విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిందే కేసీఆర్, హరీశ్
- బనకచర్లకు బీజం 2016లోనే.. అప్పుడే కోర్టుకు ఎందుకు వెళ్లలేదు!?
- కిషన్‌రెడ్డికి కేటీఆర్ ట్యూషన్ మాస్టర్.. ఆయన చెప్పిందే చేస్తారు
- గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ అవయవ దానం
- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్ఠిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో

# డిప్యూటీ సీఎంగా ఏడాది!..

## పవన్ ప్రోగ్రెస్ ఇదిగో!



2లో

(సందేశం టైమ్స్) జూన్ 20: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఉప ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి గురువారానికి సరిగ్గా ఏడాది దాటిపోతోంది. మొన్నటిదాకా సినీ నటుడిగా, ఓ రాజకీయ పార్టీ అదినేతగానే కొనసాగిన పవన్ ఏడాది క్రితం డిప్యూటీ సీఎం అనే కొత్త బాధ్యతల్లోకి ఒదిగిపోయారు. డిప్యూటీ సీఎం హోదాలో పవన్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పర్యావరణ, అటవీ, శాస్త్ర, సాంకేతిక రంగాల శాఖలను ఏరికోరి మరి ఎంపిక చేసుకున్నారు. అంతేకాదండోయ్.. ఈ శాఖలపై ఆయన అనతి కాలంలోనే సమగ్ర పట్టు సాధించేశారు కూడా.ఆది నుంచి పవన్ కల్యాణ్ అంటే ఓపెన్ టాప్ జీపు మాదిరే. ఏ విషయంలోనూ సీక్రెసీని మెయింటైన్ చేయని పవన్ డిప్యూటీ సీఎం హోదాలోనూ అలాగే సాగారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ లో గతంలో ఏ మంత్రి చేయని కార్యక్రమాలు చేపట్టిన పవన్ ఏపీ ప్రజలతో ప్రశంసలు అందుకున్నారు. పల్లె పండుగ పేరిట పవన్ ప్రారంభించిన ప్రోగ్రాం విశేషంగా ఆకట్టుకుంది. మినీ గోకులాలు పవన్ లోని నిబద్ధతను మరింతగా చాటింది. ఇక పంట కుంటలు, పశువులకు నీటి తొట్టెలు వంటి కార్యక్రమాలతో పవన్ తనదైన శైలి .పనితీను చూపెట్టారు. గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం పవన్ ప్రతిష్ఠను ఎక్కడికో చేర్చేసింది. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు నిలిపివేసిన జల్ జీవన్ మిషన్ పథకాన్ని మరింత కాలం పాటు పొడిగించేలా ప్రధాని నరేంద్ర మోదీని ఒప్పంచిన పవన్ ఏపీకి మెజారిటీ నిధులను తీసుకువచ్చారు. ఈ పనితోనే డిప్యూటీ సీఎంగా సత్తా చాటిన పవన్ ఆ తర్వాత పల్లె సీమల్లో వెలుగులు నింపుతూ సాగారు.

# సీఎస్ఆర్ నిధుల వ్యయానికి

# తెలంగాణే సరైన వేదిక





**దేశవ్యాప్త కార్పొరేట్ సంస్థలు తరలిరావాలి**

**ఇక్కడ మీరనుకున్న లక్ష్యాలు నెరవేరతాయి**

**'అసోచామ్' సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి**

హైదరాబాద్, (సందేశం టైమ్స్) జూన్ 20:కార్పొరేట్ సంస్థలు తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎసఆర్) నిధులను ఖర్చు పెట్టడానికి తెలంగాణ రాష్ట్రం సరైన వేదిక అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ సంస్థలు తమ సీఎసఆర్ నిధులను తెలంగాణలో ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు.

మిగతా 2లో...

# ట్రాన్స్‌కోలో 19 మందికి

# కారుణ్య నియామకాలు



2లో

(సందేశం టైమ్స్) జూన్ 20: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న సిబ్బంది సంక్షేమమే ప్రజా ప్రభుత్వ విధానమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజా భవన్‌లో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ట్రాన్స్‌కోలో 18 మందికి కారుణ్య నియామక పత్రాలను ఆయన అందజేశారు. వీరిలో ఏడుగురు రెగ్యులర్ ఉద్యోగులు, 11 మంది ఆర్టిజన్లుగా నియమితులయ్యారు. రెగ్యులర్ ఉద్యోగులతోపాటు ఆర్టిజన్లను సమానంగా చూస్తున్నట్లు డిప్యూటీ సీఎం విక్రమార్క చెప్పారు. కారుణ్య నియామక ఉత్తర్వులు అందుకున్న వారంతా సంస్థ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు.డీఎసీ-2024 ఉద్యోగుల వేతనాలకు లైన్‌క్లియర్

డీఎసీ-2024 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించడానికి ఆర్థిక శాఖ సుముఖత వ్యక్తం చేసింది. వారి సర్వీసును 2024 అక్టోబర్ 10 నుంచి లెక్కిస్తూ వేతనం చెల్లించడానికి అనుమతించిన ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా.. అందుకు తగు చర్యలు తీసుకోవాలని ట్రెజరీ అధికారులను దిశా నిర్దేశం చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయమై గత ఎనిమిది నెలలుగా పాఠశాల విద్యా సంచాలకుల నుంచి ఉప ముఖ్యమంత్రి వరకూ నిరంతరం కలిసి విజ్ఞప్తులు చేశామన్న యూటీఎఫ్.. వేతనాల చెల్లింపునకు ఉత్తర్వులు వెలువడినందుకు హర్షం వ్యక్తం చేసింది.

# 'రైతు భరోసా'లో కొత్తగా 1.4లక్షల మంది

**పోర్టల్‌లో నమోదుకు పూర్తయిన గడువు**

**త్వరలోనే వారి ఖాతాల్లోనూ డబ్బులు జమ**

**5వ రోజు ఏడు ఎకరాల దాకా రైతు భరోసా: తుమ్మల**



మిగతా 2లో...

హైదరాబాద్, (సందేశం టైమ్స్) జూన్ 20: రైతుభరోసా పథకంలో కొత్త రైతుల నమోదు ప్రక్రియ పూర్తయింది. జూన్ 5వ తేదీ లోపు భూమి యాజమాన్య హక్కులు పొందిన కొత్త రైతులు... రైతు భరోసా పథకంలో నమోదు చేసుకోవడానికి శుక్రవారం(20 తేదీ వరకు) దాకా ప్రభుత్వం అవకాశం కల్పించింది. పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు ?ఖాతా, ఆధార్ కార్డు జిరాక్సు ప్రతులను రైతుల నుంచి తీసుకొని రైతుభరోసా పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1.40 లక్షల మంది రైతులు ఈ వానాకాలం రైతుభరోసాలో కొత్తగా నమోదైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

# నాపై కడియం కుట్రలు



**నా ముందు కూర్చునేందుకు శ్రీహరికి నామోషీగా ఉంది**

**సీఎం రేవంత్‌కి, పొంగులేటికి లేనిపోనివి చెబుతున్నారు**

**నా మంత్రి పదవి పోతుందని తప్పుడు ప్రచారం**

**మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి కొండా సురేఖ**

వరంగల్, (సందేశం టైమ్స్) జూన్ 20: మంత్రిగా ఉన్న తనపై కడియం శ్రీహరి కుట్రలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డికి, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి లేనిపోనివి చెప్పి, తనను బద్నాం చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖ తనను కలిసిన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. మంత్రిగా ఉన్న తన ముందు కూర్చోవడానికి కడియం శ్రీహరి నామోషీగా భావిస్తున్నారని, అందుకే తన మంత్రి పదవి పోతుందంటూ ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

మిగతా 2లో...

## ముంపు గ్రామాల్ని తిరిగి తెలంగాణకు ఇవ్వాలి

**కేంద్రంపై సీఎం రేవంత్‌రెడ్డి ఒత్తిడి తేవాలి: ఎమ్మెల్సీ కవిత**



2లో

# మాట్లాడుకుందాం

న్యూఢిల్లీ, (సందేశం టైమ్స్): "గోదావరి - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సహా ఇతర జల వివాదాలపై రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులం కలిసి కూర్చుని మాట్లాడుకుందాం. ఈనెల 23న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఉంది. అందులో చర్చించి, ఆ తర్వాత నేనే ఒకడుగు ముందుకేసి చంద్రబాబును చర్చలకు ఆహ్వానిస్తా" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. బనకచర్ల ప్రాజెక్టుపై కేంద్రానికి ఏపీ ప్రీ ఫీజిబులిటి రిపోర్ట్ (పీఎఫఆర్) ఇవ్వడం వల్లే వివాదం మొదలైందన్నారు. పీఎఫఆర్ ఇచ్చే ముందే తెలంగాణతో చర్చించి ఉంటే వివాదం ఉండేది కాదన్నారు. ఏపీతో విభేదాలు కోరుకోవడం లేదని, అలాగని రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. మోదీ ప్రధాని సీట్లో కుర్చోవాలంటే చంద్రబాబు మద్దతు కావాలని, అందుకే, ఏపీ సర్కారు పీఎఫఆర్ ఇచ్చిన వెంటనే కేంద్రం స్పందిస్తోందని, బనకచర్లపై అన్ని రకాల చర్యలకు సిద్ధమైందని తెలిపారు. అదే సమయంలో, 18 నెలలుగా తాము ఎన్నిసార్లు కలిసినా స్పందించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. "ఇద్దరు సీఎంలు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై చర్చిద్దాం. ఒకరోజు కాకపోతే నాలుగు రోజులైనా చర్చలకు సిద్ధమే. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం" అని వ్యాఖ్యానించారు. రాష్ట్రాల మధ్య జల వివాదాలు చర్చల ద్వారానే పరిష్కారం అవుతాయని తెలంగాణ వంద శాతం విశ్వసిస్తుందని, అనవసర రాద్ధాంతాలు తెలంగాణకు ఇష్టం లేదని స్పష్టం చేశారు. వివాదాల పరిష్కారంలో తనకెలాంటి బేషజాలు లేవని, రాష్ట్ర ప్రయోజనాల కోసం దేనికైనా సిద్ధమేనని చెప్పారు. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య సమస్య కాదని, రెండు రాష్ట్రాలకు సంబంధించిన వ్యవహారమని తెలిపారు. పైన, కింద ఉన్న ఏ రాష్ట్రాలతోనూ తాము వివాదాలను కోరుకోవడం లేదని, మహారాష్ట్ర, కర్ణాటకతో జల వివాదాలు తలెత్తితే.. ఏపీ, తెలంగాణ కలిసి పోరాడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. జల వివాదాల విషయంలో కర్ణాటకతో ఎటువంటి సత్సంబంధాలు కలిగి ఉన్నామో.. ఏపీతోనూ అలాంటి సత్సంబంధాలనే కోరుకుంటున్నామని చెప్పారు.

చేసిన తప్పులన్నీ చేసి ఇప్పుడు హరీశ్ డ్రామాలు

తెలంగాణతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండా ఏపీ సర్కారు నేరుగా కేంద్రం వద్దకు వెళుతుండడంతో అది బీఆర్ఎసకు ఆయుధంగా మారుతోందని రేవంత్ రెడ్డి తెలిపారు. "బీఆర్ఎస్ రాజకీయంగా చచ్చిపోయింది. ఇప్పుడు జల వివాదాలను సంజీవనిగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది. తెలుగు రాష్ట్రాలు కలిసి ఉండాలని, ఎటువంటి మనస్పర్థలు రాకూడదనే సదుద్దేశంతో కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది. నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ ఏర్పడితే.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అవేమీ నెరవేరలేదు. పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రజలను మభ్యపెట్టింది. పదేళ్ల క్రితం ఎటువంటి జల వివాదాలు ఉన్నాయో, ఇప్పటికీ అవే సమస్యలు ఉన్నాయి. మాజీ సీఎం కేసీఆర్, అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్ రావు వల్ల జల వివాదాలు మరింత జఠిలంగా మారాయి. చేసిన తప్పులన్నీ చేసేసి, ఇప్పుడేమో తనకేమీ తెలియదన్నట్టు హరీశ్ మీడియా ముందుకొచ్చి డ్రామాలు ఆడుతున్నారు. పొడవు ఎక్కువ ఉన్నాను కాబట్టి, తనకన్నీ తెలుసనే భ్రమలో హరీశ్ ఉన్నారు. కానీ, పొడవున్నోడికి తెలివెక్కువ ఉండడం.. పొట్టిగున్నోడికి తెలివి కాస్త తక్కువ ఉండడం ఉండదు" అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

ఇవిగో ఆధారాలు.. జీవో కాపీలు

బనకచర్లకు బీజం పడింది 2016లోనేనని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. సర్వే చేయాలంటూ 2016-18 మధ్య కాలంలో ఏపీ ప్రభుత్వం జీవోలు ఇచ్చిందని, అప్పుడే తెలంగాణ ప్రభుత్వం కోర్టులను ఎందుకు ఆశ్రయించలేదని నిలదీశారు. "సాగునీటి విషయంలో తెలంగాణకు అన్యాయం చేసిందే కేసీఆర్, హరీశ్ రావు. వాళ్ల సహకారంతో నీటి తరలింపునకు సంబంధించి ఏపీ పదేళ్లలో రెండు జీవోలు జారీ చేసింది. దీనికితోడు, 2015 జూన్ 18, 19న కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. అందులో 512 టీఎంసీలు ఏపీకి, 299 టీఎంసీలు తెలంగాణ వినియోగించుకోవడానికి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. 2020 జనవరి 9న మళ్లీ కేఆర్ఎంబీ సమావేశం జరిగింది. అందులోనూ కృష్ణా నీటిలో 66 శాతం ఏపీకి, 34 శాతం నీటిని తెలంగాణ రెండేళ్లపాటు వినియోగించుకోవడానికి అంగీకరించారు. అలాగే, 2020 అక్టోబర్ 6న అపెక్స్ కౌన్సిల్ రెండో సమావేశం జరిగింది. అప్పటి ఏపీ, తెలంగాణ ముఖ్యమంత్రులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రావు హాజరయ్యారు. కొత్తగా.. గోదావరి బేసిన్ నుంచి కృష్ణా బేసిన్‌కు 45 టీఎంసీలను తరలించేందుకు కేసీఆర్ అంగీకరించారు. గోదావరి వరద జలాలను తరలించుకుపొమ్మని అపెక్స్ కౌన్సిల్లో కేసీఆర్ చెప్పారు. కానీ, అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మాత్రం 2023 జూలై 10న అప్పటి కేంద్ర జల్‌శక్తి మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్‌కు హరీశ్ లేఖ రాశారు. కేటీడబ్ల్యూ-2లో నీటి వినియోగాన్ని రెండు తెలుగు రాష్ట్రాలకు 50:50 రేషియోలో కేటాయించాలని కోరారు" అని వివరించారు. 2015, 2020ల్లో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లో 299 టీఎంపీలకు కేసీఆర్, హరీశ్ రావు అంగీకరించారని, తర్వాత తప్పు చేశామని ఒప్పుకొని 2023లో 50 శాతం అంటే 405 టీఎంసీలు ఇవ్వాలని లేఖ రాశారని, తాను 500 టీఎంసీలు ఇవ్వాలని అడిగితే తప్పుబడుతున్న హరీశ్ రావు.. 405 టీఎంసీలు చాలని లేఖ ఎలా రాశారని రేవంత్ నిలదీశారు. ఈ వివరాలన్నిటినీ తాను నోటి మాటకు చెప్పడం లేదంటూ వాటికి సంబంధించిన ఆధారాలు, జీవోల కాపీలను మీడియాకు అందించారు. గత పదేళ్లలో కేసీఆర్ అనుమతితోనే గోదావరి, కృష్ణా నదులపై ఏపీ పలు నిర్మాణాలు చేసిందని ఆరోపించారు. "కేసీఆర్ నాలుగుసార్లు ఏపీ ముఖ్యమంత్రులను ప్రగతి భవన్‌కు పిలిపించుకుని సమావేశాలు నిర్వహించారు. ఏపీ నీటి తరలింపునకు గేట్లు తెరిచారు. వైసీపీ నాయకురాలు రోజా ఇంటికెళ్లి రాగి సంగటి తిని మరీ రాయలసీమను రతనాల సీమగా మారుస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు" అని గుర్తు చేశారు. చేసినవన్నీ చేసేసి.. ఇప్పుడేమో తమకేదీ తెలియదన్నట్టు బీఆర్ఎస్ నాటకాలు ఆడుతోందని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం.. గోదావరి, కృష్ణా నదులపై తెలంగాణ, ఏపీలు ఏమైనా నిర్మాణాలు చేపట్టాలంటే మరో రాష్ట్రం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, అదే చట్టం ప్రకారం ఇప్పుడు బనకచర్లకు సైతం తెలంగాణ అనుమతి తప్పనిసరని చెప్పారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు వచ్చిన తర్వాత.. ఏపీ ప్రాజెక్టులపై తమకెలాంటి అభ్యంతరం లేదని పునరుద్ఘాటించారు. తెలంగాణ ప్రాజెక్టులు పూర్తయిన తర్వాతే వరద జలాలు ఎన్ని సముద్రంలో కలుస్తున్నాయో తేలతాయని, దానికి ముందే చంద్రబాబు ఎలా చెబుతారని ప్రశ్నించారు.

కాళేశ్వరం పూర్తి చేయాలంటే.. మరో రూ.50 వేల కోట్లు కావాలి

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.80 వేల కోట్లే ఖర్చయితే, లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగిందని బీఆర్ఎస్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.1,27,827 కోట్లకు టెండర్లు పిలిచారని, అందులో రూ.95,902 కోట్ల బిల్లుల చెల్లింపులు పూర్తి చేశారని వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి కావాలంటే మరో రూ.50 వేల కోట్లు అవసరమని తెలిపారు. కాళేశ్వరంతో 50 వేల ఎకరాల ఆయకట్టు మాత్రమే పెరిగిందని, దేశంలోనే ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలవడానికి, కాళేశ్వరానికి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం

# సీఎస్ఆర్ నిధుల వ్యయానికి
# తెలంగాణే సరైన వేదిక

శుక్రవారం హైదరాబాద్‌లోని మైండ్‌స్పేసలో గల 'ది వెస్టిన్' హోటల్‌లో ది అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) సదరన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన 'సీఎసఆర్ అండ్ సస్టెయినబిలిటీ' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం.. ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ బాధ్యతలతో కూడిన తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా సాగుతోందన్నారు. ప్రస్తుతం అపార వనరులున్నా.. అసమానతలతో కూడిన ప్రపంచంలో జీవిస్తున్నామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు తమ సంస్థల నిర్మాణం కోసం మాత్రమే కాకుండా సమాజ శ్రేయస్సు కోసం పనిచేయాలని ఆకాక్షించారు. 'కార్పొరేట్ సంస్థలు సీఎసఆర్ నిధులను ఖర్చు చేయడానికి రాష్ట్రం సరైన వేదిక. ఇక్కడ మీరనుకున్న లక్ష్యాలు నూటికి నూరు శాతం నెరవేరుతాయి. ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేయడానికి అవకాశముంది. మానవీయ కోణాన్ని జోడిస్తూ రాష్ట్రాభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది. పెట్టుబడులకు రాష్ట్రం అనువైన ప్రాంతం. ఇక్కడ అనుకూలమైన వాతావరణముంది. అన్నింటికీ మించి స్నేహపూరిత ప్రభుత్వం ఉంది. తెలంగాణ ఈ దేశంలోని రాష్ట్రాలతో కాకుండా అభివృద్ధి చెందిన దేశాలతో పోటీ పడుతుంది. హెల్త్, ఫార్మా, ఐటీ, ఆహార ధాన్యాల వంటి రంగాల్లో తెలంగాణది తిరుగులేని ప్రస్థానం' అని వ్యాఖ్యానించారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామని.. మొదటి దశలో నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున 100 పాఠశాలలను మంజూరు చేశామని తెలిపారు. ఈ స్కూళ్ల నిర్వహణా బాధ్యతలను చేపడతామంటూ కార్పొరేట్ సంస్థలు ముందు కొచ్చాయన్నారు. గతంలో నిర్మించిన 100 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని వెల్లడించారు. కార్పొరేట్ సంస్థల లాభాలు కేవలం ఆ సంస్థలకే పరిమితం కాకూడదని, కొంత మేర లాభాలు ప్రభుత్వ పాఠశాలల్లోని బాలికలకు, ఇబ్బందుల్లో ఉన్న రైతులకు, గ్రామీణ కళాకారులకు చేరాలని ఆకాంక్షించారు.

# డిప్యూటీ సీఎంగా ఏడాది!..
# పవన్ ప్రోగ్రెస్ ఇదిగో!

ఇక అటవీ, పర్యావరణ శాఖ మంత్రి హోదాలో పవన్ అటవీ భూములను ఆక్రమించిన దురాక్రమణ దారుల వెన్నులో వణుకు పుట్టించారు. సాక్షాత్తు వైసీపీ అదినేత జగన్ కు చెందిన సరస్వతి పవర్ భూముల్లోనూ అటవీ భూములను గుర్తించిన పవన్.. వాటిని ప్రభుత్వానికి స్వాధీనం చేశారు. ఇక వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దురాక్రమించిన అటవీ భూములనూ గుర్తించిన పవన్.. వాటిపై కేసులు నమోదు చేయించారు. ఈ వ్యవహారం ఇప్పుడు కోర్టులో నడుస్తోంది. అదే సమయంలో వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబం ఆక్రమించిన అటవీ భూములపైనా చర్యలు తీసుకున్నారు. మొత్తంగా అటవీ భూముల వైపు చూడాలంటేనే వెన్నులో వణుకు పుట్టేలా పవన్ చేశారని చెప్పక తప్పదు. ఇక డిప్యూటీ సీఎంగానే కాకుండా వ్యక్తిగతంగానూ పవన్ చాలా కార్యక్రమాలే చేపట్టారు. పవన్ చేపట్టిన ప్రతి కార్యక్రమం కూడా ఇలా ప్రజామోదం పొందిందనే చెప్పాలి. తన ప్రోగ్రెస్ ను తానే బయటపెట్టుకున్న పవన్.. భవిష్యత్తులో మరింత పారదర్శకంగా, మరింత బాధ్యతగా విధులు నిర్వర్తిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు.

# నాపై కడియం కుట్రలు

టీడీపీలో నడిపించినట్లుగా కాంగ్రెసలో నడిపించాలని చూస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఆయనకు అదృష్టం కలిసి వచ్చి మంత్రి అయ్యారని, ఇప్పుడు తనకు అదృష్టం కలిసి రావటంతో మంత్రిని అయ్యానని అయ్యారు. కడియం కుమార్తె కావ్యకు అదృష్టం కలిసి వచ్చి వరంగల్ ఎంపీగా ఎన్నికయ్యారని, తన కుమార్తెకు అదృష్టం లేక ఎమ్మెల్యే కాలేదని తెలిపారు. "కడియం కుమార్తెను ఎంపీ పదవి నుంచి తీసేయ్యాలని నేను అంటున్నానా?" అని సురేఖ ప్రశ్నించారు. కాగా, గోదావరి పుష్కరాలకు రూ.200 కోట్ల నిధులు కేటాయించాలని కేంద్రానికి లేఖ రాశామని మంత్రి తెలిపారు. ఆంధ్రకు నిధులు ఇచ్చి, తెలంగాణపై వివక్ష చూపటం తగదన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్.. పుష్కరాలకు కేంద్రం నుంచి నిధులు తీసుకరావాలని కోరారు.

# బూడిద దిబ్బలా.. దుబ్బపల్లి

భూపాలపల్లి, (సందేశం టైమ్స్): రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న కాకతీయ థర్మల్ పవర్ ప్లాంటు (కేటీపీపీ) ఓ గ్రామానికి మాత్రం శాపంలా మారింది. వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్న దాదాపు 500 కుటుంబాల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టింది. మట్టిని నమ్ముకొని పంటలు సాగుచేస్తే చివరకు బూడిద మిగులుతోంది. ఫలితంగా గ్రామంలో భవిష్యత్తు కానరాక, ప్రభుత్వ సాయమూ అందే దాఖలాలు కనిపించక.. బాధితులు వరంగల్, హైదరాబాద్ వంటి పట్టణాలకు వలసబాట పట్టేలా చేస్తోంది. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం దుబ్బపల్లికి చెందిన 1500మంది జెన్‌కో విసర్జిత వ్యర్థాలతో 15 ఏళ్లుగా సతమతమవుతున్నారు.

మొదటి నుంచీ నిర్లక్ష్యమే..

2006లో కేటీపీపీ ప్లాంటు పనులు ప్రారంభించిన రోజుల్లో చెల్పూరు శివారులోని దుబ్బపల్లికి చెందిన రైతుల నుంచి 900 ఎకరాల భూములను సేకరించారు. కానీ, నిర్వాసితులకు పరిహారం, పునరావాసంపై నిర్లక్ష్యం వహించారు. దాంతో గ్రామాన్ని తరలించే విషయం కాగితాల్లోనే నానుతోంది. 2010లో కార్యకలాపాలు ప్రారంభించిన తర్వాత విద్యుత్ ఉత్పత్తి కోసం కాల్చిన బొగ్గు కారణంగా బూడిద వ్యర్థాలు.. గాలిలో విరజిమ్ముతుండటంతో పక్కనే ఉన్న దుబ్బపల్లి తీవ్రంగా ప్రభావితమవుతోంది. గ్రామానికి సమీపంలోనే బూడిదను తరలించేందుకు సైలోస్ ఏర్పాటు చేయడంతో గ్రామమంతా బూడిదమయం అవుతోంది. 15 ఏళ్లుగా ఇళ్లన్నీ బూడిదతో నిండిపోయి గ్రామస్థులు ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఉన్న 400 ఇండ్లకు వాస్తవిక మార్కెట్ విలువ ప్రకారం స్థలాలకు గజానికి రూ.6500 చొప్పున, నిర్మాణాలకు చదరపు అడుగుల పద్ధతిలో లెక్కించి పరిహారం ఇవ్వాలని బాధితులు కోరారు. అయితే అప్పటి కలెక్టర్ కృష్ణాదిత్య రూ.5900 ధర నిర్ణయించారు. ఈ సిఫారసును కూడా అప్పటి ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ అంగీకరించలేదు. చివరకు 2023 డిసెంబరులో గజానికి రూ.4000చెల్లించేలా ఒప్పందం కుదిరింది. దాంతో నాలుగు విడతల్లో మొత్తం 562 మందికి రూ.77.43 కోట్ల మేర పరిహారం చెల్లించారు. అయితే ఇందులో స్థల పరిమాణం విషయంలో అధికారులు కొర్రీలు పెట్టారు. కేవలం నాలుగు గుంటల వరకు గజాల లెక్కన, ఆపైన స్థలానికి ఎకరాల చొప్పున చెల్లిస్తామని మెలికపెట్టారు. అంతేకాకుండా గ్రామంలో 34 ఎకరాలను సేకరించి.. మధ్యలో ఉన్న సర్వేనెంబర్ 1141లోని 10 ఎకరాలు, మరోచోట 195 ఎకరాలను వదిలేశారు. మరోవైపు రికార్డుల నమోదులోనూ అవకతవకలు జరిగాయని, ఒకరి స్థలానికి సంబంధించి మరొకరికి పరిహారం చెల్లించారని గ్రామస్థులు చెబుతున్నారు.

# 'రైతు భరోసా'లో కొత్తగా 1.4లక్షల మంది

అయితే నిర్ణీత గడువులోగా ధ్రువ పత్రాలు సమర్పించిన రైతులకు ఈ సీజన్‌లోనే రైతు భరోసా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈనెల 16 తేదీ నుంచే రైతుభరోసా డబ్బుల జమ ప్రారంభం కాగా.. శుక్రవారం నాటికి ఏడు ఎకరాల వరకు చెల్లింపులు చేశారు. అయితే, కొత్తగా నమోదు చేసుకున్న రైతులకు విస్తీర్ణంతో సంబంధం లేకుండా చెల్లింపులు చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం రోజుకో ఎకరం చొప్పున పెంచుతూ చేస్తున్న చెల్లింపులు మొత్తం పూర్తయ్యాక, కొత్త రైతులకు రైతు భరోసా డబ్బులు చెల్లించే అవకాశాలున్నాయి. కాగా, శుక్రవారం 2.64 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.906కోట్లు జమ చేసినట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ఇప్పటివరకు 65.12 లక్షల మంది రైతులు రైతు భరోసా సహాయాన్ని అందుకున్నారని తెలిపారు. ఎలాంటి పరిమితి విధించకుండా రైతు భరోసా సాయం అందిస్తున్నామని వివరించారు.

# ముంపు గ్రామాల్ని తిరిగి తెలంగాణకు ఇవ్వాలి

పంజాగుట్ట, (సందేశం టైమ్స్): పోలవరం ప్రాజెక్టు కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన ఐదు ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. 25న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీసగఢ్, ఒడిసా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రగతి ఎజెండా పేరిట ప్రధాని మోదీ నిర్వహించబోయే సమావేశంలో ఈ అంశంపై చర్చించాలని కోరారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'పోలవరం తెలంగాణపై జలఖడ్గం.. ముంపు గోడు'పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) నేత గోవర్ధన్, భద్రాచలం డెవల్‌పమెంట్ ఫోరం, ఐదు గ్రామ పంచాయతీల హక్కుల సాధన సమితి, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఏపీలో కలిపిన పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాడు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వారు రెండు రాష్ట్రాల మధ్య వివక్షకు గురవుతున్నారని, ఏ ప్రభుత్వమూ పట్టించుకోవడం లేదన్నారు. పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందని తెలిపారు. పోలవరం స్పిల్‌వే సామర్థ్యాన్ని 50లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, దాంతో భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. పోలవరం ముంపుపై ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు సంయుక్త సర్వే నిర్వహించాలన్నారు. ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపడానికి సీఎం రేవంత్ కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఆమె డిమాండ్ చేశారు.

# విప్లవ యోధుడికి అంతిమ వీడ్కోలు

## ఎర్ర సంద్రంలా మారిన వెలిశాల



భూపాలపల్లి, ప్రతినిధి/ టేకుమట్ల(సందేశం టైమ్స్) జూన్ 20 : ఆంధ్రా –ఒడిశా సరిహద్దుల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన ఎన్ కౌంటర్ లో మృతి చెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు గాజర్ల రవి అలియాస్ గణేష్ కు అభిమానులు, ప్రజాసంఘాలు, బంధు మిత్రులు కన్నీటి వీడ్కోలు పలికారు. విప్లవ సూర్యుడు రవన్నకకు అంతిమ వీడ్కోలు పలికేందుకు తెలంగాణ సహా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు రవన్న స్వగ్రామానికి భారీగా చేరుకోవడంతో.. వెలిశాల గ్రామం ఎర్ర జనసంద్రంగా మారింది. గాజర్ల రవి పార్థివ దేహానికి పూలమాల వేసి అరుణాంజలి ఘటించి శోకసముద్రంలోని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమ యాత్రలో విప్లవ గీతాలు, విప్లవ నినాదాలతో విప్లవాల పోరుగడ్డ వెలిశాల ఎరుపెక్కింది. విప్లవ యోధుడికి అడుగడుగునా అరుణ జోహార్లు అర్పిస్తూఈ అంతిమయాత్ర జనకడలిని తలపించింది. చివరి మజిలీ వరకు కొనసాగింది. గాజర్ల కుటుంబం నుంచి ఇప్పటికే ఆరుగురు అమరులయ్యారు. గాజర్ల కుటుంబ విప్లవోద్యమ చరిత్ర విని కన్నీరు మున్నీరుగా ప్రజానీకం విలపించారు. గాజర్లది బూటకపు ఎన్ కౌంటర్ అని ప్రజా సంఘాలు ఆరోపించాయి. సుప్రీం కోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశాయి.

మారణ హోమం ఆపాలి

భారత్ బచావో అధ్యక్షులు గాదె ఇన్నయ్య దేశ ప్రజలకు విముక్తి కోసం ఉద్యమించిన వ్యక్తి గాజర్ల రవి అలియాస్ గణేష్ అని, చంద్రబాబు మారణ హోమం ఆపాలి అని భరత్ బచావో అధ్యక్షులు తెలంగాణ సిద్ధాంత కర్త, ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య ఘాటుగా హెచ్చరించారు. ముందుగా గాజార్ల రవి పార్థివ దేహానికి నివాళులు అర్పించిన అనంతరం మీడియతో మాట్లాడారు. ఏపీ సీఎం చంద్రబాబు ప్రధాని మోడీ, అమిత్ షా కాళ్ళు కడుగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసులకు కోసం అంబేడ్కర్ రాజ్యాంగంలో 5 వ షెడ్యూల్ అమలు కోసం రవి ఉద్యమించాడన్నారు. నరహంతక చంద్రబాబు గ్రేహౌండ్స్ బలగాలను వాడి పచ్చటి అడవుల్లో రక్తపుటేరులు పారిస్తున్నాడన్నారు. ఆపరేషన్ కాగర్ తో ఇప్పటికే 600 మందిని పొట్టన పెట్టుకున్నారని అమిత్షా పై ఆగ్రహం వ్యక్తం చేశారు. షుగర్ వ్యాధితో అనారోగ్య పరిస్థితుల్లో ఉన్న గాజర్ల రవిని పట్టుకొని 12 గంటలు చిత్రహింసలు పెట్టిఅతి దారుణంగా చంపారని ఆరోపించారు. కుటుంభ సభ్యులకు రవి అనారోగ్యంతో ఉన్నడని ఇంటలిజెన్స్ వర్గాలతో సమాచారం ఇచ్చి కావాలనే హతమార్చారన్నారు. రవి మరణంతో దేశంలో ఓ సూర్య కిరణం అస్తమించిందని, హత్యాలతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అస్తమించిన రవి దేశానికి వెలుగునిస్తాడన్నారు. నరమేధం సృష్టిస్తున్న ఆపరేషన్ కాగర్ ను వెంటనే ఆపాలని డిమాండ్ డిమాండ్ చేశారు.

# వేగంగా బోనాల జాతరకు ఏర్పాట్లు

## బోనాల పండుగ ధార్మిక ఉత్సవాలకు మణిహారం

(సందేశం టైమ్స్) జూన్ 20: హైదరాబాద్ అంటేనే బోనాల జాతర గుర్తుకు వచ్చేలా చేస్తుంది. ఈ పండుగ ఆషాఢ మాసంలో మొదలై నెలరోజుల పాటు కొనసాగుతుంది. మాతృశక్తికి అంకితమైన ఈ ఉత్సవం నగరానికి ఆధ్యాత్మిక వెలుగు నింపుతుంది. ఆషాఢ మాసం వచ్చిందంటేనే నగరంలోని వివిధ ప్రాంతాల్లో అమ్మవారి ఆలయాలు, వీధులు రంగురంగుల ఫ్లెక్సీలతో, విద్యుత్ దీపాల అలంకరణలతో వెలిగిపోతాయి. ప్రభుత్వం కూడా బోనాల నిర్వహణలో ఎంతో ప్రాధాన్యతనిస్తూ ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా లక్షలాది మంది భక్తులు పాల్గొనబోతుండటంతో అధికార యంత్రాంగం ప్రత్యేక బందోబస్తు, ట్రాఫిక్, మెడికల్, నీటి సదుపాయాల ఏర్పాటు చేపట్టింది.



ఆధ్యాత్మికత, సాంప్రదాయం కలిసిన జాతర

బోనాల పండుగలో ఓ ప్రత్యేకత ఉంది. అమ్మవారిని పుట్టింటికి తీసుకువచ్చినట్టుగా భావించి, ఆమెకు ప్రత్యేకంగా అలంకారం చేసి, ధూప దీప నైవేద్యాలతో 'బోనం'సమర్పించడం అనేది ప్రధాన ఆనవాయితీ. ఈ బోనాల్లో అన్నం, కూరగాయలు, జిలకర, కర్పూరం, నెయ్యి, పసుపు, కుంకుమ వంటి పదార్థాలను భక్తులు బొజ్జ పై వుంచి అమ్మవారికి అర్పిస్తారు. తరువాత ఆ అమ్మవారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లడం జరుగుతుంది. ఇది కేవలం భక్తి భావన మాత్రమే కాదు, ఒక కుటుంబ సంప్రదాయాన్ని ప్రతిబింబించే సందర్భం కూడా. ఇక బోనాల సందర్భంగా జరిగే పోతురాజుల ఆటలు, డప్పులు, నృత్యాలు, మహిళల పాడే దివ్య పాటలు మతపరమైన ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తాయి.

తేదీల ప్రకారం బోనాల వేడుకలు

ఈ ఏడాది బోనాల ఉత్సవాలు జూన్ 26న గోల్కొండ బోనాలతో ప్రారంభమవుతాయి. ఈ రోజు జగదాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జూన్ 29న విజయవాడ కనకదుర్గమ్మకు భక్తులు బోనం సమర్పిస్తారు. జూలై 13న సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా జరుగనుంది. జూలై 14న 'రంగం' కార్యక్రమంలో భవిష్యవాణి వెల్లడించడం అనేది ప్రత్యేక ఆకర్షణ. జూలై 20న లాల్‌దర్వాజ బోనాల ఉత్సవం, జూలై 21న ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు, జూలై 24న ముగింపు ఉత్సవాలు జరుగనున్నాయి. మొత్తం నెలరోజుల పాటు ఈ పండుగ కొనసాగనుండటంతో హైదరాబాద్ నగరం తిరుగులేని జాతరాకార రూపం ధరించనుంది.

దేశ విదేశాలనుండి భక్తుల రాక, భద్రతా ఏర్పాట్లు

బోనాల జాతర ప్రత్యేకతలను ఆస్వాదించేందుకు విదేశాల నుంచి కూడా తెలుగు ప్రవాసులు, భక్తులు రాగా, ఇతర రాష్ట్రాల నుంచీ భక్తులు భారీగా తరలివస్తారు. వీరి రాకను దృష్టిలో ఉంచుకుని అధికారులు ట్రాఫిక్ నియంత్రణ, శుచిత్వ నిర్వహణ, వైద్య సేవలు వంటి అంశాల్లో ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు. హైదరాబాద్ నగరంలోని గోల్కొండ, లాల్‌దర్వాజ, సికింద్రాబాద్, కూకట్‌పల్లి, ఎల్లారెడ్డిగూడ, చార్మినార్ ప్రాంతాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండనుంది.

తర్వాతి తరాలకు వెలుగు చూపే పండుగ

ఈ బోనాల పండుగ కేవలం భక్తి కాకుండా తెలుగు సంస్కృతికి మద్దతు ఇచ్చే ఒక జీవకళ. ఈ వేడుకలు కొత్త తరం వారికి మన పూర్వీకుల సంప్రదాయాలను, మాతృశక్తిపై భక్తిని గుర్తు చేస్తాయి. అమ్మవారి బోనం సమర్పించడం ద్వారా మనిషిలోని సమర్పణ భావాన్ని, దైవభక్తిని, సామూహిక సంఘీభావాన్ని పెంపొందించడమే ఈ పండుగ ముఖ్య ఉద్దేశం. మానవత్వానికి, ప్రకృతికి కృతజ్ఞత చెప్పే విధంగా బోనాల ఉత్సవం కొనసాగుతుంది.

# టోలిచౌకిలో 28మంది

## అక్రమ విదేశీయుల గుర్తింపు



హైదరాబాద్,(సందేశం టైమ్స్)జూన్ 20: టోలిచౌకి పారామౌంట్ కాలనీలో నేడు పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గత కొన్ని రోజులుగా నైజీరియన్లు సోమాలియన్లు కారణంగా పారామౌంట్ కాలనీలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయంటూ ఫిర్యాదులు వస్తుండడంతో నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలతో దక్షిణ, పశ్చిమ మండలం డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 300ఇండ్లను పోలీసులు తనిఖీలు చేశారు. 28 మంది విదేశీయుల వద్ద సరైన పత్రాలు లేవని, 16 మంది వీసా కాలం పూర్తయినట్లు గుర్తించామని డీసీపీ చంద్రమోహన్ తెలిపారు. పత్రాలు సరిగా లేని 25 ద్విచక్ర వాహనాలు, రెండు కార్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. అక్రమంగా గ్యాస్ ఫిల్లింగ్ చేస్తున్న కేంద్రాన్ని గుర్తించి సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అక్రమంగా ఉంటున్న విదేశీయుల కు సంబంధించిన వివరాలను విదేశాంగ శాఖ అధికారులకు పంపిస్తామని, దీనికి సంబంధించి వారే నిర్ణయం తీసుకుంటారని డీసీపీ పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా పకడ్బందీగా పోలీసింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

కాగా, సుమారు 250 మంది పోలీసులతో పాటు డీసీపీ చంద్రమోహన్, అదనపు డీసీపీ ఇక్బాల్ సిద్ధికి, ఏసీపీలు సుదర్శన్, సయ్యద్ ఫయాజ్, విజయ్ శ్రీనివాస్, మమ్మద్ మునావర్ తో పాటు 15 మంది ఇన్స్పెక్టర్లు, 22 మంది ఎస్సైలు, సిబ్బంది ఈ తనిఖీలలో పాల్గొన్నారు.


# 100 రోజుల ప్రణాళికను

## పర్యవేక్షించిన సీఎస్ రామకృష్ణారావు

శంషాబాద్,(సందేశం టైమ్స్)జూన్ 20: శంషాబాద్ మున్సిపాలిటీ 100రోజుల ప్రణాళికలను తెలంగాణ సీఎస్ రామకృష్ణారావు పర్యవేక్షించారు. శంషాబాద్ మున్సిపల్ పట్టణ పరిధిలో వంద రోజుల ప్రణాళికను అడిగి, అలాగే సమస్యలపై మున్సిపల్ కమిషనర్ సుమన్ రావును, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్, ఆర్డీఓ వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి

## నీతా అంబానీ భూరి విరాళం.



హైదరాబాద్ (సందేశం టైమ్స్) జూన్ 20: నగరంలో ప్రసిద్ధి చెందిన బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి ప్రముఖ వ్యాపారవేత్త ముఖేష్ అంబానీ భార్య నీతా అంబానీ భారీ విరాళం అందజేశారు. ఎల్లమ్మ గుడికి కోటి రూపాయల విరాళం అందించారు నీతా అంబానీ. నేరుగా టెంపుల్ బ్యాంక్ ఖాతాకు విరాళాన్ని ట్రాన్స్‌ఫర్ చేశారు. కాగా, ముఖ్యంగా నగరంలో ఉప్పల్ స్టేడియంలో ముంబై ఇండియన్స్ ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నా సమయంలో నీతా అంబానీ అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇలా ఈ ఏడాది ఏప్రిల్ 23న నీతా అంబానీ తల్లి పూర్ణిమ దలాల్, సోదరి మమతా దలాల్తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆ సమయంలో వారు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) కృష్ణ వారికి ఆలయ ప్రాముఖ్యతను, విశిష్టతను వివరించారు. దేవస్థానం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందించాలని ఆయన వారిని కోరారు. అప్పటి ఈవో విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన నీతా ఇప్పుడు కోటి రూపాయలను విరాళంగా అందించారు.

త్వరలో ఆషాడ మాసం రానుంది. భాగ్యనగరం బోనాలు సంబరాలకు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో బల్కంపేట అమ్మవారి ఆలయం కూడా ముస్తాబవుతుంది. నీతా అంబానీ కోటి రూపాయల విరాళం బుధవారం రోజున దేవస్థానం బ్యాంక్ ఖాతాలో జమ అయింది. ఈ విరాళం సొమ్ము మొత్తనాన్ని బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి.. దానిపై వచ్చే వడ్డీతో భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తామన్న ప్రస్తుత ఈఓ మహేందర్‌గౌడ్ చెప్పారు.

# పోలవరం వల్ల భద్రాద్రి ఆలయం

## మునిగిపోయే ప్రమాదం - ఎమ్మెల్సీ కవిత



(సందేశం టైమ్స్) జూన్ 20: పోలవరం ప్రాజెక్ట్ స్పిల్వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచడం వల్ల తెలంగాణకు తీవ్రమైన బ్యాక్ వాటర్ సమస్య ఎదురయ్యే అవకాశం ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ మార్పులు జరిగితే గోదావరి నదిపై ఉన్న భద్రాచలం రామాలయం ముంపు ప్రమాదంలో పడతుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

సుప్రీం కోర్టు వరకు వెళ్లిన తెలంగాణ జాగృతి

పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణలోని పలు ప్రాంతాలు మునిగే అవకాశం ఉందని ఇప్పటికే ఎన్నోసారి హెచ్చరించామని కవిత గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ జాగృతి ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని, సుప్రీం కోర్టును ఆశ్రయించిన సంగతి ఆమె ప్రస్తావించారు. ఇప్పుడైనా కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణం స్పందించి పోలవరం ముంపు ప్రాంతాలపై సంయుక్త సర్వే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. భద్రాచలం రక్షణకు ప్రత్యామ్నాయాలు కావాలితెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో జరిగిన ఈ చర్చా వేదికలో పలు విభిన్న వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు. భద్రాచల దేవాలయం మునిగిపోవడం కేవలం శైవ వైష్ణవ సంప్రదాయాలకే కాదు, కోటి మంది భక్తుల మనోభావాలకు తాకిడి అవుతుందని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టు నిర్మాణంలో మార్పులు చేయకుండా ముందుకెళితే, భద్రాచల ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఎమ్మెల్సీ కవిత హెచ్చరించారు. తదుపరి చర్యలపై ప్రభుత్వాలు చొరవ చూపి పరిష్కార మార్గాలు సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ఎన్టీఆర్ బేబీ కిట్లు

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు ప్రజాప్రభుత్వం నిర్ణయం**
**తల్లీ, బిడ్డలకు ఆరోగ్య వనరుల కల్పనపై దృష్టి**
**గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమలైన పథకాన్ని పునరుద్ధరించిన సీఎం చంద్రబాబు**

(సందేశం టైమ్స్) జూన్ 20: ప్రభుత్వ ఆసుపత్రులను పటిష్ఠం చేయాలి.. పేద రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి.. ఆసుపత్రుల్లో చేరే వారికి మెరుగైన వసతులు కల్పించాలి.. ఈ ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఈపాటికే ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల నియామకాలపై దృష్టిపెట్టగా.. తాజాగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సమర్థంగా అమలైన ఎన్టీఆర్ బేబీ కిట్ పథకాలను పునరుద్ధరించింది. ప్రసవాలకు వచ్చే పేద తల్లుల నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు ప్రజాప్రభుత్వం నిర్ణయించింది. ఆసుపత్రుల్లో పురుడు పోసుకున్న ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ బేబీ కిట్లు అందించేలా చర్యలు చేపట్టింది. 2014-19లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ విధానం అమలు చేయడంతో రాష్ట్రంలో లక్షలాది మంది పేద తల్లులు, నవజాత శిశువులు సురక్షితంగా ఇళ్లకెళ్లారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం హయాంలో ఈ పథకాన్ని తొలగించి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే తల్లులు, పిల్లల పట్ల నిర్లక్ష్యం వహించింది. ప్రస్తుతం సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని తిరిగి పునరుద్ధరించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే తల్లులకు త్వరలోనే ఎన్టీఆర్ బేబీ కిట్లు అందించనుంది. వీటిని త్వరితగతిన ఆసుపత్రులకు అందించేలా అవసరమైన చర్యలను చేపట్టింది. దీంతో మహిళల్లో ఆనందంతోపాటు బిడ్డలకు ఈ పథకం రక్షణ కవచం కానుంది.

**కిట్‌లో 11 రకాల వస్తువులు**

రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న ఎన్టీఆర్ బేబీ కిట్‌లో11 రకాల వస్తువులు ఉంచనున్నారు. దీని ఖరీదు సుమారు రూ.1410గా ఉంటుంది. పురిటి బిడ్డలు సుఖంగా నిద్రించేందుకు బెడ్, దోమతెర, తల్లులు చేతులు శుభ్రం చేసుకునే శానిటైజర్, బేబీ సబ్బు, న్యాప్‌కిన్, పౌడర్, రెండు టవల్స్, చిన్న బొమ్మవంటి వస్తువులు ఉంటాయి. వీటిని బయట కొనుగోలు చేయాలంటే సుమారు రూ. 1000 నుంచి రూ.1500 వరకు ఉంటుంది. కాగా ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే పేదవారికి ఎన్టీఆర్ బేబీ కిట్లు ఆరోగ్యకరమైన వనరులుగా మారనున్నాయి.

**జిల్లాలో నెలకు 1500 ప్రసవాలు**

జిల్లాలో ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఒకటి ఉండగా, మార్కాపురంలో జిల్లా వైద్యశాల ఉంది. ప్రైమరీ హెల్త్ సెంటర్లు 89, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు 9 వరకు ఉన్నాయి. వాటితోపాటు ఏరియా ఆసుపత్రులు మరో 9 వరకు ఉన్నాయి. వీటిల్లో నెలకు సుమారు 1500 వరకు ప్రసవాలు జరుగుతుండగా, వారిలో అత్యధిక శాతం మంది నిరుపేదలే. బిడ్డపుట్టగానే పరిశుభ్ర వస్త్రాల్లో ఉంచి సంరక్షణ చర్యలు చేపట్టాలి. లేకపోతే ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశం ఉంది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలోనే ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపడంతో శిశుమరణాలు కూడా నమోదైన సందర్భాలు ఉన్నాయి. కాగా ప్రజా ప్రభుత్వం శిశు మరణాలు తగ్గించడంతోపాటు, తల్లుల ఆరోగ్యంపైన ప్రత్యేక దృష్టి సారించింది. దీంతోఎన్టీఆర్ బేబీ కిట్లు అందజేసి, తల్లి, బిడ్డ సంరక్షణ ధ్యేయంగా దృష్టి సారించింది.

# ప్రేమ పేరుతో పిలిచి..

**సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై హత్యాయత్నం**
**దుండగులతో దాడి చేయించిన ప్రేమికుడు**
**ఒంగోలులో ఘటన**

ఒంగోలు(సందేశం టైమ్స్) జూన్ 20: పరిచయం ఉన్న యువతి ప్రేమగా మాట్లాడి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రమ్మని పిలిచి తన ప్రియుడుతో కలిసి హత్య చేసేందుకు యత్నించారు. ఈ సంఘటన ఒంగోలులోని కిమ్స్ ఆసుపత్రి సమీపంలో గల ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... ఒంగోలు మండలం కరవది గ్రామానికి చెందిన ఓ యువతి, యలమంద అనే యువకుడు ఐదు నెలల క్రితం ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్ళారు. అక్కడ ఒంగోలు నగరం శ్రీ రామ్‌కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బూసి వెంకటేష్ వారికి పరిచయం అయ్యాడు. ఈక్రమంలో సదరు యువతికి వెంకటేష్‌తో ప్రేమగా మాట్లాడుతూ సన్నిహితులయ్యారు. ఇలా నాలుగు నెలలు తరువాత ఆ యువతి, యలమంద కలిసి హైదరాబాద్ నుంచి తిరిగి స్వగ్రామం వచ్చారు. అయితే వారి ఇరువురు ప్రేమించుకున్నారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న వెంకటేష్‌తో తన ప్రియురాలు మాట్లాడుతుందని గుర్తించిన యలమంద ఆమెతో గొడవపడ్డాడు. ఈక్రమంలో ఇరువురు కలిసి ఓ పథకం రూపొందించారు. తన ప్రియురాలితో సన్నిహితంగా ఉంటున్న వెంకటేష్‌ను అడ్డు తొలగించాలని యలమంద తన మిత్రులతో కలిసి మాట్లాడుకున్నాడు. ఈనేపథ్యంలో తన ప్రియురాలితో వెంకటేష్‌కు ఫోన్ చేయించాడు. మనం కలవాలంటూ వెంకటేష్‌ను ఒంగోలుకు పిలిపించారు. కిమ్స్ ఆసుపత్రి సమీపంలో ఉన్నానంటూ ఆమెతో ఫోన్ చేయించాడు యలమంద. దీంతో అక్కడకు కారులో వెంకటేష్ రాగానే యలమంద, మరో నలుగురు యువకులు పూటుగా మద్యం తాగి అతడిని చితకబాది హత్యాయత్నం చేశారు. అదే సమయంలో గస్తీలో ఉన్న పోలీసులు గుర్తించి అక్కడకు వెళ్లేసరికి దుండగులు పరారీ అయ్యారు. చావుబతుకుల మధ్య ఉన్న వెంకటేష్‌ను వెంటనే రిమ్స్‌కు తరిలించారు. దుండగులలో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

# బదిలీ తేదీపై స్పష్టత ఇవ్వాలి : యుటిఎఫ్

## డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు



అనంతపురం (సందేశం టైమ్స్) జూన్ 20: తెలుగు, హిందీ పాఠశాల సహాయకుల రిలీవింగ్, జాయినింగ్ తేదీలపై స్పష్టత ఇవ్వాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) శ్రీ సత్య సాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉదయం అనంతపురం విద్యాశాఖధికారి ఎం.ప్రసాద్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, అనంతపురం జిల్లా అధ్యక్షులు గోవింద రాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య మాట్లాడుతూ తెలుగు, హిందీ పాఠశాల సహాయకుల రిలీవింగ్, జాయినింగ్ విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు స్థానిక మండలాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. 2025 లో జరిగిన బదిలీలలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారులు 8/06/25న విడుదల చేసిన ఉత్తర్వులు ప్రకారం తెలుగు, హిందీకి సంబంధించిన ఉపాధ్యయులు 08/06/2025 రిలీవ్ అయ్యి, 09/06/2025 నూతన పాఠశాలల్లో జాయిన్ కావాలని చెప్పారన్నారు. పాఠశాల సహాయకులు తెలుగు, హిందీకి సంబంధించి తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు రిలీవ్ కాకూడదని 08/06/2025న సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ ఉత్తర్వులు అనుసరించి భాష పాఠశాల సహాయకులు ఆరోజు బదిలీ పొందిన పాఠశాలలో చేరకుండా పూర్వపు పాఠశాలలోనే డిప్యూటేషన్ కింద హాజరు అయ్యారన్నారు. 15/06/25న విడుదల చేసిన ఉత్తర్వుల్లో 14వ తేదీ రిలీవింగ్ 15న జాయినింగ్ అని కొంతమంది, 15న రిలీవింగ్ 16న జాయినింగ్ అని కొంతమంది ఉపాధ్యాయులు ఉన్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుల్లో సందిగ్ధత ఉందన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ ఉపాధ్యాయులకు స్పష్టమైన తేదీని జిల్లావ్యాప్తంగా ప్రధాన ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బదిలీ పొందిన వారికి క్యాడర్ స్ట్రెంగ్త్ ఇస్తూ సకాలంలో జీతాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు స్థానిక మండలాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ వీటిపై రెండు రోజుల్లో స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, నారాయణ స్వామి, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

# యోగా దినోత్సవంలో పాల్గొనండి

## పిటిసిలో యోగా డే నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం(సందేశం టైమ్స్) జూన్ 20: అనంతపురం పిటిసి గ్రౌండ్‌లో ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించే జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ డాఎవి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 21వ తేదీ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు గంట సేపు జిల్లా స్థాయి యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో దాదాపు 5వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో 23 లక్షల మంది జనాభా ఉండగా, యోగాంధ్రలో భాగంగా ఇంటింటికి సర్వే చేసి 9,97,518 మంది పౌరులను రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. యోగాలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరూ ఆయా కేంద్రాల్లో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. అన్ని విద్యాలయాల్లో యోగా కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది యోగాలో పాల్గొని ప్రపంచ రికార్డు చేయగలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, డిఎంహెచ్ఒ డాఎఈబి.దేవి, ఆయుష్ అధికారి డాఎరామ్ కుమార్, పాల్గొన్నారు.

21న అనంతపురం పిటిసి గ్రౌండ్‌లో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ డాఎవి.వినోద్ కుమార్ గురువారం పరిశీలించారు. ఆర్డీవో కేశవులు నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఈబి.దేవి, డీఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలన చేశారు. యోగా కోసం పిటిసికి వచ్చే వారు యోగాసనాలు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

# గిరిజనుల్లోనే అధికంగా సెకిల్‌సెల్ ఎనీమియా



పల్నాడు (సందేశం టైమ్స్) జూన్ 20: అరుదైన, జన్యుపరమైన వ్యాధి సికిల్ సెల్ ఎనీమియాను రూపుమాపేందుకు కృషి చేద్దామని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. దీనిపై నరసరావుపేట మండలం పెద్దతురకపాలెం గిరిజన బాలికల సంక్షేమ వసతి గృహ పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథులుగా హాజరవగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ కొద్ది మందికో వచ్చే సికిల్ సెల్ ఎనీమియా వస్తుందని, బాధితులను వెంటనే గుర్తిస్తే వారిని కాపాడొచ్చని చెప్పారు. సికిల్ సెల్ ఎనీమియా వంశపారపర్యంగా రక్తంలో ఆక్సిజన్ తక్కువై తెల్ల రక్త కణాల శాతం పడి పోతుందన్నారు. ఈ వ్యాధిపై గిరిజనుల్లో ఎక్కువ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా ఉందని, మేనరికాలు, ఒకే రక్తం కలిగిన వారిని వివాహం చేసుకోవడం వల్ల ప్రధానంగా ఈ వ్యాధి సోకుతుందని చెప్పారు. రక్త హీనత, సరిపడ ఆక్సిజన్ అందకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ బి.రవి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి జోత్స్న, ఆర్‌డిఒ కె.మధులత, తహశీల్దార్ వేణుగోపాలరావు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ఒక్కో తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఉన్న మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం 100కి తగ్గకుండా అడ్మిషన్లు జరగాలని ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. నరసరావుపేట మండలం కేశానుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ మాట్లాడుతూ నెమ్మదిగా నేర్చుకునే పిల్లలపై, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పాఠాలను ఓపిగ్గా బోధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తిన్నారు. ఈ నెల నుంచి సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలో పరిశుభ్రమైన మినరల్ వాటర్ సరఫరా చేస్తుండటంపై అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో మధులత, డిఈఓ ఎల్.చంద్రకళ పాల్గొన్నారు.

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006